గోల్కొండ కోటలో అమ్మవారికి పూజలు



గోల్కొండ: గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. బుధవారం కేంద్ర పురాతత్వ సర్వేషణ శాఖ అధికారి నవీన్‌కుమార్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారి బి.సురేష్‌చారి ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సీఎంను కలిసిన నాయకులు



సీఎం రేవంత్‌తో అక్తర్ యూసుఫ్ జాహీ తదితరులు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఇన్‌చార్జిగా నియమితులైన అక్తర్ యూసుఫ్‌జాహీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కష్టపడే కార్యకర్తలకు పార్టీలో ఎప్పుడూ పెద్దపీట ఉంటుందని పేర్కొన్నారు.

నియామకం



బండారి రాధిక

అబిడ్స్: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సీనియర్ బీజేపీ నాయకురాలు బండారి రాధికను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఆదేశాలు జారీచేసింది. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. పాతబస్తీతో పాటు గ్రేటర్, తెలంగాణ నలుమూలలా బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ అందేలా చొరవ తీసుకుంటానని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

గోషామహల్‌లో సీసీ రోడ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని కామటిపురా, చందన్‌వాడీలో సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే రాజాసింగ్ కార్పొరేటర్ లాల్‌సింగ్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.41 లక్షల వ్యయంతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆల పురుషోత్తమ్, డి.గోపాల్‌జీ, రవీందర్ సింగ్, మహేశ్ మ్యాదరి, శ్రీకాంత్, సుధీర్, కిషన్, సోమ్రాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాంబాగ్‌లో..



సుల్తాన్‌బజార్: జాంబాగ్ డివిజన్‌లోని ఎస్‌డీనగర్, పటేల్‌నగర్, పూసలబస్తీ, ఆదాబ్ హోటల్ ప్రాంతాల్లో రూ.51 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే రాజాసింగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న హిమగిరి

గన్‌ఫౌండ్రీ: పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు మనుమరాలు కనక హయతి లివర్ ఇన్ఫెక్షన్‌తో కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. జానపద కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డం హిమగిరి బుధవారం ఆమెను పరామర్శించి రూ.20 వేలు అందజేశారు. వైద్యం కోసం రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని, ఎవరైనా దాతలు సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఫోన్ పే, గూగుల్ పే 62819 50490 నంబర్‌కు పంపించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాతం చెరువు దశ మారేదెన్నడో..?

దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని వైనం

- రోజురోజుకూ కుచించుకుపోతున్న విస్తీర్ణం
- మరోవైపు పేరుకుపోతున్న వ్యర్థాల డంపింగ్



చెరువు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలు



శాతం చెరువులో విస్తరించిన గుర్రపు డెక్క

గోల్కొండ: గోల్కొండ కోట నయాకిలా ప్రహరీ కిందివైపు ఉన్న శాతం చెరువు దశ మారడం లేదు. దశాబ్దాలుగా సుందరీకరణకు నోచుకోవడం లేదు. పలుమార్లు మంత్రులు, బల్దియా అధికారులు ఇక్కడికి వచ్చి చెరువును అభివృద్ధి చేస్తాం..చెరువు చుట్టూ వాకర్స్ కోసం ట్రాక్..పార్కును ఏర్పాటు చేస్తామంటూ హామీలు ఇస్తున్నారే తప్ప ఒక్కటి కూడా అమలు చేయడం లేదు. మరోవైపు శాతం చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పేరుకుపోయింది. పూడికతీత పనులు కేవలం గుత్తేదారుల జేబులు నింపడం కోసమే జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు చెరువు కట్ట వ్యర్థాల డంపింగ్‌కు అడ్డాగా మారుతోంది. కొంతకాలం క్రితం చెరువుకు వేసిన గ్రీన్ ఫెన్సింగ్‌ను తొలగించి మరీ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. ఎండీలైన్స్, టోలిచౌకీ నదీమ్ కాలనీ నుంచి చెరువు కట్ట గుండా గోల్కొండ రిసాలబజార్‌కు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వ్యర్థాల డంపింగ్‌తో దుర్వాసన వస్తుండడంతో చాలామంది చెరువు కట్టవైపు రావడమే లేదు.

తూతూ మంత్రంగా చర్యలు...

గతంలో శాతం చెరువు దుస్థితిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా బల్దియా అధికారులు స్పందించారు. చెరువు కట్టపై ఇద్దరు డీఆర్ఎఫ్ సెక్యూరిటీ గార్డులను నియమించారు. దీంతో శాతం చెరువు కట్టపై వ్యర్థాల డంపింగ్ పూర్తిగా ఆగిపోయింది. కానీ 3 నెలలు తిరగక ముందే సెక్యూరిటీ గార్డులను వెనక్కి పిలిపించుకున్నారు. దీంతో మళ్లీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి శాతం చెరువు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'రుగ్వేదానికి రాహుల్ గ్రహణం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ చెర్రావూరి శివరామ కృష్ణ శర్మ రచించిన 'రుగ్వేదానికి రాహుల్ గ్రహణం' పుస్తకావిష్కరణ సభను రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. గ్రంథాలను పరిశోధించి అద్భుతమైన సమాచారాన్ని పాఠకులకు అందించే ప్రయత్నం చేశారని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని పుస్తకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దూరదర్శన్‌పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ రేవూరి అనంత పద్మనాభారావు, ఇతిహాస సంకలన సమితి కార్యదర్శి మల్లం వీరేందర్, విశ్రాంత అధ్యాపకులు వెంకటేశ్వరరావు, కవి కుమారస్వామి శాస్త్రీ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు రండి



చార్మినార్: ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో ఈనెల 20న నిర్వహించనున్న బోనాలకు హాజరుకావాలని కోరుతూ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ ప్రతినిధులతో కలిసి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కు బుధవారం ఆహ్వానపత్రం అందజేశారు. కమిటీ కార్యదర్శులు భవానీ శంకర్, ఆనంద్ , ప్రతినిధులు ఉన్నారు.

వరద ముప్పు నివారణకే మాన్సూన్ బృందాలు



వాహనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: వర్షాకాలంలో వరద సమస్యలపై తక్షణమే స్పందించేందుకే జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మాన్సూన్ ప్రత్యేక వాహన బృందాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. స్థానిక కార్పొరేటర్లు, అధికారులతో కలిసి సంబంధిత వాహనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో రోడ్లపై వరద నీటి సమస్య, గుంతల పూడ్చడం, మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, నీటిని తొలగించడం తదితర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం డివిజన్ల వారీగా వాహనాలను కేటాయించిందన్నారు. కార్యక్రమంలో తలాబ్‌చంచలం, డబీర్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, అలాందార్ వాలా జాహి, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కార గ్రహీతల ఎంపిక

నాంపల్లి: పలు రంగాల్లో విశేష కృషి చేసిన 12 ప్రముఖులను 2023 సంవత్సరానికి గాను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలుగు వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలనాగ (కవిత), డాక్టర్ ప్రభల జానకి (విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి (చిత్రలేఖనం), సంపత్ రెడ్డి (శిల్పం), పేరిణి రమేశ్‌లాల్ (నృత్యం), హరిప్రియ (సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి(పత్రికారంగం), గుమ్మడి గోపాలకృష్ణ (నాటకం), కడకంచి పాపయ్య (జానపద కళారంగం), ధూళిపాళ మహాదేవమణి (అవధానం), ఆచార్య కె.మలయవాసిని(ఉత్తమ రచయిత్రి), డాక్టర్ శాంతి నారాయణ (నవల/కథ) ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి త్వరలో నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని నందమూరి తారాక రామారావు కళా మందిరంలో పురస్కారం కింద ఒక్కొక్కరికీ రూ.20,116 పారితోషికం అందజేసి సత్కరిస్తామని ఆయన తెలిపారు.

మీర్‌చౌక్ ఏసీపీ బాధ్యతల స్వీకరణ

చార్మినార్: మీర్‌చౌక్ ఏసీపీగా శ్యాంసుందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన వెంకటేశ్వర రావు బదిలీ కాగా ఆయన స్థానంలో శ్యాంసుందర్‌ను నగర సీపీ సీవీ ఆనంద్ నియమించారు. గతంలో మలక్‌పేట్ ఏసీపీగా విధులు నిర్వర్తించిన శ్యాంసుదర్‌కు పాతబస్తీపై అవగాహన ఉంది. దక్షిణ మండలంలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది. మీర్‌చౌక్ డివిజన్‌లోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

9న ఫుడ్ లైసెన్స్ మేళా

బంజారాహిల్స్: రెస్టారెంట్లు, ఫుడ్ బిజినెస్ నిర్వహించే వారికి ఈనెల 9న ఫుడ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు శ్రీవెంక, కే.సౌమ్యారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్ సర్కిల్ పరిధిలోని వ్యాపారుల కోసం ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో మేళా ఉంటుందని తెలిపారు. ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు టర్నోవర్ చేసే వ్యాపారులు పాల్గొని ఫుడ్ లైసెన్స్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు 73311 89774, 79933 54252.

వచ్చేనెల 10న అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ, ఎంబీఏ(హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్ ఆగస్టు 10న నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు చివరి తేదీ జూలై 15 అని పేర్కొన్నారు. ఆగస్టు 10న మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు రాష్ట్రంలోని నిర్దిష్ట పరీక్షా కేంద్రాల్లో మాత్రమే ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఐ-సెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్ లేదా వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: రోడ్డు నంబర్-12లోని శ్రీవేంకటేశ్వర హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో సొసైటీ లేఅవుట్ ఓపెన్ స్పేస్‌ను ఆక్రమించి నిర్మించిన ప్రహరీలను బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ అధికారులు, హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. ఓ వ్యక్తి సుమారు 400 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీనిర్మించాడు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఈ స్థలం విలువ రూ.12 కోట్లు ఉంటుంది. ఇంటి నెంబర్ 8-2-293/82/ఎల్/182/ఏ లో ఉన్న ఈ ఖరీదైన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని, ఇది పూర్తిగా అక్రమమని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.


తాగునీటి సమస్యను పరిష్కరించాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి విన్నవిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ కోరారు. ఈ మేరకు జలమండలి మెనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని బుధవారం కలిసి నీటి కొరత ఉన్న ప్రాంతాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గోల్కొండ, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో నూతన పైపులైన్ వేయాలని అలాగే హకీంపేట్, కాకతీయనగర్, సాలర్‌జంగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్యతో పాటు వేళాపాల లేకుండా నీటిని వదులుతున్నారని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై జలమండలి ఎండీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

సీసీ రోడ్డుకు మరమ్మతులు



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా గౌలిపురా కోట మైసమ్మ ఆలయం వద్ద గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి రూ.2.60 లక్షల నిధులతో సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్య సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్, మామిడి కృష్ణ, బి.వై.శ్రీకాంత్, రఘుకాంత్, కన్నా, మురళి పాల్గొన్నారు.

రోడ్డు వేయరూ..!

జియాగూడ: పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా వరకు గల 100 పీట్ల జాతీయ రహదారి అధ్వానంగా తయారయ్యింది. ఇటీవల భారీ పైప్‌లైన్ కోసం రహదారిపై పలుచోట్ల తవ్వకాలు చేపట్టారు. అయితే పనులు పూర్తయినా సంబంధిత ప్రాజెక్ట్ అధికారులు మళ్లీ రోడ్డు వేయలేదు. దీంతో వాహనాదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల లంగర్‌హౌస్ ట్రాఫిక్ విభాగం రద్దీని దృష్టిలో పెట్టుకుని రహదారికిరువైపులా ఉన్నా మట్టి కుప్పలను శ్రమదానం చేసి తొలగించారు. అయితే రోడ్డు నిర్మాణం జరిగితేనే సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతుందని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



పైప్‌లైన్ పనులు పూర్తయినా రోడ్డు వేయని దృశ్యం

బల్కంపేట ఎల్లమ్మ తల్లికి బంగారు బోనం



బంగారు బోనంతో జోగిని నిషా క్రాంతి

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ తల్లికి బుధవారం మూడో బంగారు బోనాన్ని సమర్పించారు. సప్త మాతృకులకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఏడు అమ్మవారి ఆలయాల్లోని అమ్మవార్లకు బంగారు పాత్రలో బోనాన్ని సమర్పించడం 2018 నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే గోల్కొండ జగదాంబికా అమ్మవారితో పాటు విజయవాడలోని కనక దుర్గమ్మ తల్లికి సమర్పించారు. ముందుగా అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భాజాభజంత్రీల నడుమ పోతురాజుల నృత్యాలతో దారి పొడవునా భక్తులను అలరిస్తూ ముందుకు కదిలారు. బోనం పూజా కార్యక్రమాల్లో పలువురు అధికార ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోగిని నిషా క్రాంతి బంగారు బోనం ఎత్తారు.

మహంకాళేశ్వర ఆలయంలో హంపి పీఠాధిపతి



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయాన్ని బుధవారం సందర్శించారు. గత నెల 28న ప్రారంభమైన రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం పూజలను పర్యవేక్షించారు. అలాగే భక్తులకు ఆశీర్వచనం అందజేశారు. 21 రోజుల పాటు మహాయాగం కొనసాగి ఈనెల 18న ముగియనున్నది. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టేల్ సదానంద్ యాదవ్, కాట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీబీకా అలావాలో ఆలంల సందర్శన



ఆలంల వద్ద ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



బీజేపీ నాయకురాలు మాధవీలత

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా డబీర్‌పురా బీబీకా అలావాను బుధవారం సందర్శించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ కంటెస్టెడ్ మాధవీలత ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలావా నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, నాయకులు హిదాయత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఉన్నతికి పరిస్థితులు అనుకూలించాలి



సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఏ వ్యక్తి అయినా ఉన్నతస్థాయికి ఎదిగేందుకు నిబద్ధతతో పాటు పరిస్థితులు అనుకూలించాలని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గంజి సత్యనారాయణ 75 ఏళ్ల వజ్రోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వోద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూనే సాంస్కృతిక రంగంపై ఉన్న మక్కువతో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తి సత్యనారాయణ అని ప్రశంసించారు. సత్కళాభారతి సంస్థను స్థాపించి ఎంతో మంది కళాకారులను ప్రోత్సహించారని కొనియాడారు. నాటకరంగంతో పాటు సీరియల్, సినిమాలలోనూ సత్తా చాటారని గుర్తుచేశారు. అంతకుముందు అమ్మ చెక్కిన బొమ్మన నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హన్మంతరావు, రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్, సత్కళాభారతి వ్యవస్థాపకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.


కిటికీ నుంచి దూకడంతో విద్యార్థికి తీవ్రగాయాలు?

గోల్కొండ: షేక్‌పేట్‌లోని ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఓ బాలుడు కిటికీలోంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డికి చెందిన రెహాన్ అనే బాలుడు షేక్‌పేట్ సత్యకాలనీలోని ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. జూన్ 30న రాత్రి 8.30 గంటల సమయంలో రెహాన్ బయటకు వెళ్లి ఏదైనా ఆహారం తీసుకుందామని భావించి..భవనంలోని కిటికీలోంచి బయటకు వెళ్లేందుకు యత్నించాడు. ఈ క్రమంలో జారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడగా విద్యుదాఘాతంతో నేలమీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి విద్యార్థులు గమనించి టోలిచౌకీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో ఉస్మానియాకు తరలించారు. ఈ విషయం బయటకు పొక్కకుండా స్కూల్ యాజమాన్యం గోప్యంగా ఉంచినట్లు తెలిసింది.

వరకట్నం కేసులో ఐదేళ్ల జైలు

చార్మినార్: వరకట్నం వేధింపుల కేసులో భర్తకు 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానాను విధిస్తూ 15వ ఏసీజేఎం కోర్టు జడ్జి డి.అజయ్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. దక్షిణ మండలం మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. 2015 లో మేరీ ప్రసన్న కుమారి వివాహం నర్సింహారెడ్డితో జరిగింది. తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని 2016లో భార్య దక్షిణ మండలం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాదోపవాదాలు విన్న జడ్జి నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఉమన్ సేఫ్టీ వింగ్ డీసీపీ డాక్టర్ పి.లావణ్య నాయక్ జాదవ్ పర్యవేక్షణలో దర్యాప్తు పకడ్బందీగా సాగిందని ఆయన పేర్కొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయితో నిందితుడు మహ్మద్ అమీర్

సంతోష్‌నగర్: గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కంచన్‌బాగ్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేసి రూ.1.86 లక్షల విలువైన 7.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ ఎర్రకుంట ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీర్ (27) ఐదేళ్లుగా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే జల్సాలు చేసేందుక డబ్బులు సరిపోకపోవడంతో గంజాయి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ పడ్డాడు. దీంతో గంజాయి సరఫరా చేసే హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ అలియాస్ షబ్బాను కలిశాడు. అతని వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి అవసరమైనవారికి ఎక్కువ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్ పోలీసులు కంచన్‌బాగ్ పోలీసులతో కలిసి దాడులు చేసి మహ్మద్ అమీర్‌ను అరెస్ట్ రిమాండ్‌కు తరలించారు.